


భోగిమంటల్లో విద్యుత్తు బిల్లుల దహనం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీల భారానికి వ్యతిరేకంగా కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి వస్తుంటే కనీసం ఈ ప్రభుత్వాలకు చలనం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం చేపట్టక ముందు బాదుడే బాదుడు.. అంటూ కరెంటు ఛార్జీలపై గొంతు ఎత్తిన టిడిపి.. నేడు కూటమి పేరుతో స్నేహగీతాలు ఆలపిస్తూ విద్యుత్తు ఛార్జీల రూపంలో ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రజలపై వేల కోట్ల భారాలు వేసే కార్పొరేట్లకు కమ్మరించేందుకు తీసుకొచ్చిన విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి దహనం చేయాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత

- బయోటెక్నాలజీ, ఇవి క్లస్టర్ల ఏర్పాటుకు కృషి
- అంగన్వాడీలకు వేతనాలు అందలేదన్న విషయం తెలియదు
- ఆర్థిక ఇబ్బందులవల్లే చంద్రన్న కానుక ఇవ్వలేదు
- చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కేవలం ఏడు నెలల కాలంలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగను ప్రజలంతా ఆనందంగా జరుపుకుంటున్నారని తెలిపారు. విజయనగరంలోని తమ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత ఏడు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్రాంతి శుభవేళ చాలా రోజుల నుంచి పెండింగ్లో ఉన్న పలు సమస్యలకు ముఖ్యమంత్రి పరిష్కారం చూపారన్నారు.

గత ఐదేళ్లగా పెండింగ్లో ఉన్న సుమారు రూ.6,750 కోట్ల బకాయిలను ముఖ్యమంత్రి విడుదల చేసి, వివిధ వర్గాల్లో వెలుగులు నింపారన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు పేరుకుపోయిన బకాయిలను విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల జిపిఎఫ్ బకాయి కింద రూ.519 కోట్లు, పోలీసులకు సరెండర్ లీవుల కోసం రూ.788 కోట్లు విడుదల చేసి సుమారు 54,900 మందికి ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. దాదాపు 6.5 లక్షలమంది విద్యార్థులకు స్కాలర్షిప్పులు చెల్లించేందుకు రూ. 788 కోట్లను విడుదల చేశామన్నారు. టిడిఎస్, చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల కింద రూ. 250 కోట్లను, ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు రూ.90 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పెట్టిన బకాయిలను కూడా తమ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు రెండు రోజుల్లోనే డబ్బులు జమ చేయడం వల్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో పెట్రో కెమికల్, ఫార్మా రంగాల అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. జిల్లాలో వలసలను నివారించి, ఉపాధిని పెంచేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, దీనికోసం ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బయోటెక్నాలజీ, ఇవి క్లస్టర్ల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి వివరించారు. పర్యాటక రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రయివేటు భాగస్వామ్యంతో పలు పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగానే ఇటీవల తాటిపూడిలో బోటు షికారును ఏర్పాటు చేశామన్నారు. రాయపూర్ గ్రీన్ఫీల్డ్ హైవే, భోగాపురం విమానాశ్రయం పూర్తయితే ఉపాధి అవకాశాలు మరింత విస్తృతం అవుతాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు 58 శాతం పూర్తయ్యాయన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణం, గుంతలు పూడ్చివేత తదితర కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రంధి అర్జున మహేశ్వరరావు, టిడిపి నాయకులు కడగల ఆనందకుమార్, దత్తిరాజేరు మండల అధ్యక్షులు చప్ప చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

☞ గతం మాదిరిగా చంద్రన్న సంక్రాంతి సరుకులు ఎందుకు ఇవ్వలేదని 'ప్రజాశక్తి' ప్రశ్నించగా, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, అందువల్లే ఇటువంటి మంచి పథకాన్ని కూడా అందజేయలేకపోయామని మంత్రి సమాధానం చెప్పారు.

☞ పండగ సమయంలో కూడా ఒక్క విజయనగరం జిల్లాలో మాత్రమే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు ఎందుకు ఇవ్వలేదన్న 'ప్రజాశక్తి' ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 'ఆ విషయం నాకు తెలియలేదు... వెంటనే తెలుసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను' అని చెప్పారు.

ఆర్టిసి బస్సులు ప్రారంభం

విజయనగరం కోట : ఆర్టిసి విజయనగరం డిపోలో నాలుగు నూతన బస్సులను ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలో 14 బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. మానాపురం, చీపురుపల్లి వద్ద వంతెన పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఆర్అండ్బి అధికారులతో మాట్లాడి, పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎస్డబ్ల్యుఎఫ్, ఎన్ఎంయు, ఇయు నాయకులు పలు సమస్యలపై మంత్రికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టిసి జోనల్ చైర్మన్ ఎస్.దొన్నుదొర, డిపిటిఒ సిహెచ్ అప్పలనారాయణ, సిటిఒ కె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సిఐ బి.ఆదినారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆర్టిసి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



జనాలతో కిటకిటలాడుతున్న ఎంజి రోడ్డు

మార్కెట్కు సంక్రాంతి

కిటకిటలాడిన షాపులు ● నగరంలో భారీగా ట్రాఫిక్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్, కోట

సంక్రాంతి నేపథ్యంలో జిల్లా కేంద్రమైన విజయనగరంతో పాటు బొబ్బిలి, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం పట్టణాలు ఆదివారం జనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా విజయనగరంలోని గంటస్తంభం, పిడబ్ల్యుమార్కెట్, కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ఆర్టిసి కాంప్లెక్సు, మున్సిపల్ మార్కెట్ కొనుగోలుదారులతో నిండిపోయాయి. సోమవారమే భోగి కావడంతో, ఆదివారం విజయనగరానికి గ్రామాల నుంచి సరుకులు, దుస్తుల కోసం జనం తరలివచ్చారు. ఊకపోస్తే రాలనంత జనంతో నగరంలో సందడి నెలకొంది. ఉదయం 10 గంటల నుంచే సరుకులు, నూతన వస్త్రాలను కొనేవారితో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వారు వారి సొంతూళ్లకు చేరుకోవడం, పనిలో పనిగా అవసరమైన దుస్తులు, సామగ్రి కొనుగోలు చేస్తుండటంతో నగరమంతా జనమే కనిపించారు. పండగకు పిండి వంటల కోసం సరుకులతో పాటు కొత్తబట్టలు కొనుగోలు చేయడంతో ఆయా దుకాణాలు కిటకిటలాడాయి. కార్పొరేట్ వస్త్ర దుకాణాలు కళకళలాడగా, కొనుగోలుదారులు లేక బాలాజీ మార్కెట్ వెలవెలబోయింది.



సరుకులు తీసుకెళ్తున్న మహిళలు



కిటకిటలాడుతున్న మార్కెట్ రోడ్డు

ఎక్కడికక్కడే ట్రాఫిక్

నగరానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలిరావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. మూడు లాంతర్లు నుంచి ఎమ్జి రోడ్డు, కన్యకా పరమేశ్వరి కోవెల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులు కొనుగోలుదారులతో నిండిపోయాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రధానంగా షాపింగ్ మాల్స్ వద్ద కొనుగోలుదారులతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. కనీసం రోడ్లపై ద్విచక్ర వాహనాలు నడపడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందంటే, మాల్స్ వద్ద ఎంత రద్దీ ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా గంటస్తంభం వైపు ట్రాఫిక్ను నియంత్రణ చేయడంలో పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో మార్కెట్లోకి ద్విచక్ర వాహనాల తప్ప పెద్ద వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్లకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో కొనుగోలుదారులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు.

బస్సులు కిటకిట



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో విజయనగరంలోని ఆర్టిసి కాంప్లెక్సు రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. ఎక్కడెక్కడో ఉంటూ స్వగ్రామాలకు చేరుకుంటున్న వారితో ఆదివారం ఆర్టిసి కాంప్లెక్సు కిక్కిరిసిపోయింది. బస్సులు ఎక్కడానికి ప్రయాణికులు పోటీ పడ్డారు. ప్రధానంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వలస కూలీలు విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తెనాలి, హైదరాబాద్, చెన్నైలో పనులు చేసుకుంటున్నారు. అలాగే ఉద్యోగాలు, చదువు రీత్యా పలువురు ఆయా ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు వస్తుండడంతో బస్సులన్నీ కిటకిటలాడాయి. ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూశారు.

రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలను పరిష్కరించాలి

కలెక్టర్కి ఎపి రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన అర్జీలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్కి ఆదివారం లేఖ రాశారు. జిల్లాలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన భూ సమస్యల వినతులు గ్రామసభలో కొన్ని పరిష్కరించారని తెలిపారు. గ్రామసభలో పరిష్కరించని వినతుల్లో కొద్దిమందికి రశీదులు ఇచ్చి, మిగతా రైతులకు రశీదులు కూడా ఇవ్వలేదని చెప్పారు. రశీదు అడిగినా అనేక ప్రాంతాలలో దాట వేశారని తెలిపారు. ఆ దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో రైతులకు తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. అందువల్ల గ్రామసభలో వచ్చిన అన్ని అర్జీలను పరిష్కరించాలని కోరారు.

ఐద్వా, బాలల సంఘం ఆధ్వర్యాన

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గులను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐద్వా, బాలల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ముచ్చెరువుగట్టుపై ఆదివారం ముగ్గులు, ఆటలు, పాటలు, డాన్సులతో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. అనంతరం ఐద్వా నగర కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహనరావు, జెవివి నగర అధ్యక్షులు ఎల్.చిన్నారి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్, నాయకులు రామకృష్ణ, బుచ్చయ్య , చిన్నమ్మలు, వెంకటమ్మ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శంకర్రావు, ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ వ్యవసాయం దివాలా తీసి గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేసి పట్టణాలకు వలసలు వస్తున్నారని తెలిపారు. తిరిగి సంక్రాంతికి గ్రామాలన్నీ నిండుగా కనిపిస్తాయని చెప్పారు. పట్టణీకరణ నేపథ్యంలో గత సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి నిలవాలంటే వలసలు తగ్గాలని, పల్లెలు, వ్యవసాయం, చేతివృత్తులు అభివృద్ధి కావాలని తెలిపారు. అందుకు ప్రభుత్వం నూటికి 65 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన పేదలకు కనీసం ఇల్లు, ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటుగా ఉపాధి హామీ చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

మైనేని స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి



మైనేని వెంకటరత్నం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐక్య ఉపాధ్యాయ పత్రిక మొట్టమొదటి సంపాదకులు మైనేని వెంకటరత్నం స్ఫూర్తితో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్కె ఈశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ మైనేని వెంకటరత్నం అవినీతికి, మతోన్మాదానికి వ్యతిరేక రచనలు చెయ్యడం, సమాజంలో సంపద అంతా దేశ ప్రజలకు చెందుతుందని, రాజ్యాంగ విలువలు అందరూ పాటించాలని ఎల్లప్పుడూ కోరేవారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జెఆర్సి పట్నాయక్, జిల్లా కార్యదర్శులు ఎన్.సత్యనారాయణ, కె.ప్రసాదరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, ఎం.రఘునాథరాజు, జిల్లా నాయకులు పి.రామకృష్ణ, పైడిరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్ : సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, కార్యకర్తలకు, నాయకులకు ఆయన ఒక ప్రకటన ద్వారా భోగి, సంక్రాంతి, కనుమ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండగ సమయంలో పంటలన్ని చేతికంది పల్లెలు ధాన్య రాశులతో కళకళలాడుతాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటా భోగి.. భోగ భాగ్యాలను, సంక్రాంతి.. ప్రతీ సంతోషాన్ని, రైతుల పండుగ కనుమ మధురమైన జ్ఞాపకాలను మిగల్చాలని అభిలషించారు.

సంక్రాంతి వెలుగులు నింపాలి

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

విజయనగరం కోట : తెలుగు ప్రజలు ఎంతో ప్రత్యేకంగా జరుపుకునే సంక్రాంతి పండగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి , కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి పండగ భోగ భాగ్యాలు కలిగించాలని, అందరి ఇళ్లల్లో సంక్రాంతి శోభ సంతరించాలని, మూడు రోజుల పండగ సందడితో ప్రతిఒక్కరూ ఆనందంగా గడపాలని కలెక్టర్ తెలిపారు.

నగర ప్రజలకు సురక్షిత నీరు

విజయనగరం టౌన్ : నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే తమ లక్ష్యమని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని గాజులరేగ, గుబేల్పేట, దిగువవీధి, రాజవీధి ప్రాంతాల్లో ఆయన పర్యటించి, నీటి పంపిణీపై ఆరాతీశారు. నలకలతో నీరు వస్తోందని స్థానికులు చెప్పడంతో అందుకు గల కారణాలను ఆయన పరిశీలించారు. కుళాయి కనెక్షన్లు పాతవి కావడాన్ని గుర్తించి, వెంటనే కొత్త పైపులైన్లు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ నీటి వల్ల కొందరు విరోచనాల బారిన పడ్డారని స్థానికులు తెలపగా, తక్షణమే తాగునీటి నాణ్యతా పరీక్షలు చేశారు. నీరు కలుషితం కాలేదని గుర్తించి, ప్రజలకు అవగాహన కల్పించారు.

యువకుడి అదృశ్యంపై ముమ్మరంగా దర్యాప్తు

- జాగిలంతో గ్రామంలో పరిశీలన
- దొరకని ఎటువంటి ఆచూకీ
- కాల్డేటాపై దృష్టిసారించనున్న పోలీసులు



యువకుడి దుస్తుల వాసన చూస్తున్న పోలీసు జాగిలం

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని తీరప్రాంత గ్రామమైన చినకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన యువకుడి అదృశ్యంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి నుంచి గ్రామానికి చెందిన గనగళ్ల దానయ్య అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం పోలీసు జాగిలాన్ని రప్పించి గ్రామానికి తీసుకువెళ్లారు. దానయ్య దుస్తుల వాసన చూసిన జాగిలం.. యువకుడి ఇంటి నుంచి నేరుగా పక్కనే ఉన్న ఆయన అత్తగారి ఊరైన చోడిపిల్లిపేట వెళ్లింది. ఆ గ్రామంలో రెండు మూడు వీధులు తిరిగి అనంతరం తోటలో మద్యం సీసాలు ఉన్నచోట ఆగింది. దీంతో అక్కడ మద్యం సేవించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి మళ్లీ యువకుడి ఇంటికి వెళ్లింది. ఇంట్లో వంటగదికి వెళ్లి అక్కడ నుంచి బీరువా ఉన్న చోటకు వెళ్లడంతో పోలీసులు బీరువాను క్లూస్ కోసం తనిఖీ చేశారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి ఆగిపోయింది. కాని ఎటువంటి ఆధారాలూ పోలీసులకు చిక్కలేదు. ఎందుకంటే? ఇక్కడ నుంచి ఆ రోజు వచ్చిన బైక్లపై వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఆ యువకుడు గతంలో వాడిన ఫోన్ నెంబర్ల కాల్డేటా ద్వారా విశ్లేషించనున్నారు. ఆయన ఎక్కువగా గతంలో ఏయే నెంబర్లకు మాట్లాడరనే దానిపై విచారణ సాగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొంతమందిని పోలీసులు విచారణ చేస్తున్నారు. కాని ఎక్కడ, ఎటువంటి ఆధారాలూ దొరకడం లేదు. దీనిపై ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ యువకుడి అదృశ్యంపై ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తామని తెలిపారు.

రూ.45 కోట్లతో పర్యాటక అభివృద్ధి

- తాటిపూడిలో ఎకో టూరిజం
- చింతపల్లిలో హరిత రిసార్ట్స్
- చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంగా రామతీర్థం
- రామనారాయణం సమీపంలో చిల్డ్రన్ పార్కు
- 'ప్రజాశక్తి'తో జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి ముఖాముఖి

జిల్లాలో నాలుగు చోట్ల రూ.45 కోట్ల అంచనాతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని జిల్లా పర్యాటక అధికారి కె.కుమారస్వామి తెలిపారు. తాటిపూడిలో ఎకో టూరిజం, చింతపల్లిలో హరిత రిసార్ట్స్ నిర్మాణం, రామతీర్థం ఆలయ పరిసరాలను చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంగాను, రామనారాయణం క్షేత్రానికి సమీపంలోని గోపాలరాజు కోనేరును చిల్డ్రన్ పార్కుకు గాను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి కుమారస్వామి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

తాటిపూడిలో టూరిజాన్ని ఎలా అభివృద్ధి చేయబోతున్నారు.?


తాటిపూడి జలాశయం ఇప్పటికే జిల్లాలోని ఓ ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందింది. పర్యాటకులను మరింతగా ఆకర్షించాలనే లక్ష్యంతో రూ.23 కోట్లతో ఎకో టూరిజం తలపెట్టాం. ఇప్పటికే జలాశయంలో బోటింగ్ ఉంది. అదనంగా జలాశయం దిగువ భాగంలో 10.63 ఎకరాల స్థలాన్ని కేటాయించాం. ఇందులో 12 కాటేజీలు నిర్మించతలపెట్టాం. రెండు కొండల నడుమ రోప్వే, కేబుల్ అండ్ సస్పెన్ బ్రిడ్జి, చిల్డ్రన్ పార్కు, బర్డ్ పార్కు, రెస్టారెంట్, కన్వెన్షన్ హాల్, ఓపెన్ ఎయిర్, యాంఫే థియేటర్ తదితరాలను నిర్మించనున్నాం. వీటన్నింటికీ రూ.23కోట్ల మేర అవసరమౌతుందని భావిస్తున్నాం.

గోపాలరాజు కోనేరు ఎలా అభివృద్ధి చేస్తారు.?

రామనారాయణం ఎదురుగా ఉన్న ఈ కోనేరు సారిక రెవెన్యూ పరిధిలో ఉంది. 8.5 ఎకరాల్లో ఉన్న విస్తరించి ఉన్న ఈ కోనేరు నిత్యం నీటితో తొణికిసలాడుతూ ఎంతో ఆహ్లాదాన్నిస్తోంది. దీన్ని టూరిజం స్పాట్గా అభివృద్ధి చేస్తే రామనారాయణం వచ్చే పర్యాటకులంతా ఇక్కడ పిల్లలతో కలిసి సేదతీరడానికి, విహరించడానికి ఎంతో అనువుగా ఉంటుంది. అందుకే ఇక్కడ రూ.6 కోట్లతో బోటింగ్, చిల్డ్రన్ పార్కు, కోనేరు సుందరీకరణ, అక్కడే ఫుడ్ కోర్టు, రెస్టారెంట్, హాట్ ఎయిర్ బెలూన్ వంటివి ఏర్పాటు చేయనున్నాం.

చింతపల్లిలో ఏయే ప్రత్యేకతలు రాబోతున్నాయి.?

బీచ్ టూరిజంలో భాగంగా చింతపల్లి తీరంలో రూ.6 కోట్లతో పర్యాటకాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. వాస్తవానికి ఇక్కడ మూడు కాటేజీలు ఉండేవి. ప్రస్తుతం అవి మరమ్మతులకు చేరుకోవడంతో పర్యాటకులు సేదదీరేందుకు అవకాశం లేదు. ఈనేపథ్యంలో మొత్తం 20 గదులు కలిగిన 10 హరిత రిసార్ట్స్ను ఏర్పాటు చేయనున్నాం. పర్యాటకులు బీచ్ను ఆస్వాదించేందుకు వసతి, తీర ప్రాంతానికి వచ్చే పోయేందుకు ప్రత్యేకమైన రహదారులు, రెస్టారెంట్, కాంపౌండ్వాల్ వంటి సదుపాయాలు కూడా కల్పిస్తాం. ఈ పర్యాటక కేంద్రం విజయనగరానికి, అటు జాతీయ రహదారికి, భోగాపురం విమానాశ్రయానికి అత్యంత చేరువలో ఉంటుంది.



రామతీర్థం టూరిజం ఎలా ఉండనుంది.?

రామతీర్థం ఇప్పటికే చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇక్కడ బౌద్ధ, జైన మతాల అవశేషాలు ఉన్నాయి. టెంపుల్ టూరిజంలో భాగంగా వీటిని పరిరక్షించేందుకు అవకాశం ఉంది. ఇందులో భాగంగా మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. కోనేరు గట్టు సుందరీకరణ, కొండపైన వ్యూపాయింట్ ఏర్పాటు, అక్కడే టీ, స్నాక్స్ అందుబాటులో ఉండేవిధంగా చేయాలనేది ప్రణాళిక. ఇందుకోసం రూ.10 కోట్లు అవసరం కానున్నట్టు ప్రణాళిక రూపొందించాం.



అవినీతి అధికారులు మాకొద్దు
ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో అవినీతి అధికారులకు చోటు లేదని, అవినీతికి పాల్పడే అధికారులు నియోజకవర్గం నుంచి బదిలీపై వెళ్లిపోవాలని ఎమ్మెల్యే బేబినాయన హెచ్చరించారు. కోటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతి రహిత పాలన అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవినీతికి చోటు లేకుండా అన్ని శాఖల అధికారులు పని చేయాలని, అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అవినీతికి తావులేకుండా పని చేయలేని అధికారులు నియోజకవర్గం నుంచి బదిలీపై బయటకు వెళ్లిపోవాలని కోరారు.

వైసిపి నిర్లక్ష్యంతోనే రోడ్లుకీ దుస్థితి

వైసిపి నిర్లక్ష్యంతోనే రోడ్లుకీ దుస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. 2018లో టిడిపి హయాంలో పారాది వంతెనకు నిధులు మంజూరైనప్పటికి తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి పనులు ప్రారంభించలేదన్నారు. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలకు అనుమతులు లేని కారణంగా భారీ వాహనాలు బాడంగి, ఆకులకట్ట, తెర్లాం, పినపెంకి, కారాడ, అలజంగి, గొల్లపల్లి మీదుగా బొబ్బిలి రాకపోకలు చేశాయని, దీంతో రోడ్లు పూర్తిగా పాడైపోయాయని, ఆయా రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. చిలకపాలెం నుంచి రాజాం, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి మీదుగా రాయగడ వరకు పబ్లిక్, ప్రైవేట్ పాట్నర్ షిప్ విధానంతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో రోడ్లు నిర్మాణం మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. గ్రామాల్లో లింక్ రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రోత్ సెంటర్లో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారని చెప్పారు. గ్రోత్ సెంటర్లో పరిశ్రమలు పెడితే నష్టాలు వస్తాయని, గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని నమ్మకుండా పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు ఇచ్చేందుకు సీతానగరం సువర్ణముఖి నది నుంచి ప్రత్యేక పైపులైన్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-2005 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 20 ఏళ్లు పూర్తి కావడంతో ఒకే చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తోటి మిత్రులను ఆత్మీయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కీర్తిశేషులైన ఉపాధ్యాయులు, తోటి సోదరులు ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. గురువులను శాలువా, మెమొంటిలతో సన్మానించి, ఉపాధ్యాయులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి రిటైర్డ్ హెడ్ మాస్టర్ సిహెచ్ మల్లేశ్వరరావు, ప్రజెంట్ హెడ్ మాస్టర్ పి.నాగయ్య, 25 మంది పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు సుమారు 100 మంది పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బొబ్బిలి: రాజా కళాశాలలో 1992-95 బ్యాచ్‌లో బిఎ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ చదువుకున్న పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం కళాశాలలో అపూర్వంగా కలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమర వేసుకుని సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రిన్సిపాల్ డి.రఘునాథరావు, అధ్యాపకులు ఎస్.వినయభూషన రావు, పి.జాన్‌నెల్సన్, కెఎంవిఎల్ నరసింగరావు, పి.అంజలిదేవి, కె.లక్ష్మునాయుడు, సి. వేణుగోపాల రావు, పి. గౌరీశ్వర రావు, డివి జగ్గారావు అధ్యాపకేతర సిబ్బంది పూర్వ విద్యార్థులను ఆశీర్వదించారు.

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి
ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం

వృద్ధాశ్రమాలకు ప్రభుత్వమే సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుచేయాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు కోరారు. శంకరరావు తన మాతృమూర్తి దాడిచిలుక మంగమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని పినవేమలిలో ఉన్న ఎబిసిడి వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు కుటుంబ సభ్యులతో కలిసి స్వీట్లు, పండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు కూడా చేశారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో కరెంట్ బిల్లు నెలకు ఆరువేల రూపాయలకు పైబడి వస్తుందని నిర్వాహకులు చెప్పడంతో ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఆయన 'సేవాభావంతో నిర్వహిస్తున్న ఇలాంటి వృద్ధాశ్రమాలకు పూర్తి సబ్సిడీతో ప్రభుత్వమే సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే మేల న్నారు. ఈ విషయాన్ని సిఫార్సు చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

డాక్టర్ సూర్యప్రకాష్ సేవలకు సత్కారం

ప్రజాశక్తి- బొబ్బిలి

హైదరాబాద్ కేర్ వైద్యశాలలో కార్డియాలజీ విభాగాదిపతిగా పని చేస్తున్న ప్రముఖ గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ సేవలను గుర్తిస్తూ బొబ్బిలికి చెందిన రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు, కారుణ్య ముఖ్య కార్యనిర్వాహకులు డేవిడ్ జె విక్టర్‌లు డాక్టర్ సూర్య ప్రకాష్‌ను బొబ్బిలిలోని చైతన్య డయోగ్నస్టిక్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో జెసి రాజు మాట్లాడుతూ బొబ్బిలి, పరిసర ప్రాంతాలలో గుండె జబ్బులతో భాదడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని, అనేక వ్యయ ప్రయాసల కోర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్య చికిత్సలు పొందే అవసరం లేకుండా గుండె జబ్బుల వైద్య చికిత్సలో నిపుణులుగా పేరుగాంచిన డాక్టర్ సూర్య ప్రకాష్ బొబ్బిలి వచ్చి ఇక్కడ హృద్రోగ బాధితులకు ఉత్తమ వైద్యాన్ని అందిస్తూ ప్రశంసలు పొందుతున్నారని అన్నారు. వైద్య సేవలు పేదవారికి కూడా మరెంత అందుబాటులో ఉండేలా సేవలను అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికి 50 ఏళ్లుగా భోగి మంట లేదు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని అలుగోలు గ్రామంలో గత 50 ఏళ్లుగా బోగి మంట లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ గ్రామంలో ఏబై ఏళ్ల క్రితం భోగి మంటలో పడి ఒక వ్యక్తి చనిపోవడంతో అప్పటి నుండి గ్రామంలో ప్రజలు భోగి మంటకు దూరంగా ఉండడం ఆనవాయితీగా వస్తున్నారని చెబుతున్నారు. సంక్రాంతి, కనుమ మాత్రం యథావిధిగా జరుపుతామని చెప్పారు.

శివశంకర్‌కు కలెక్టర్ పరామర్శ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తెలంగాణ రాష్ట్ర ఐఎఎస్ అధికారి లోతేటి శివశంకర్ తండ్రి సన్యాసప్పడు శృంగవరపుకోట మండలం ధర్మవరంలో మరణించిన నేపథ్యంలో ఆయనను జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదివారం పరామర్శించారు. ధర్మవరంలోని శివశంకర్ నివాసానికి వెళ్లి వారి తండ్రి మృతికి సంతాపం తెలిపారు. గతంలో లోతేటి శివశంకర్ మన రాష్ట్రంలో పల్నాడు, కడప జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశ్రీ సిఇఒగా చేస్తున్నారు.

పవన్‌ను కలిసిన ఎంపిపి బంటుపల్లి

ప్రజాశక్తి- డెంకాడ

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని స్థానిక ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు ఆదివారం విజయవాడలోని కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పార్టీ పరిస్థితిని ఉపముఖ్యమంత్రికి ఎంపిపి వివరించారు. మండల అభివృద్ధికి తన శాఖ నుంచి ఎక్కువ నిదులిచ్చి ఆదుకోవాలన్నారు. మండల అభివృద్ధితో పాటు పార్టీని కూడా అభివృద్ధి చేయాలని ఎంపిపిని పవన్ కోరారు. బంటుపల్లి దిలీప్ కుమార్ పవన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేటకు చెందిన ఎం.దేవుడమ్మ (69) శనివారం రాత్రి చలిమంట కాగుతుండగా చీరకు నిప్పు అంటుకొని తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మరణించిందని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి తెలిపారు. కుమార్తె వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

రెండు మేకపోతులు చోరీ

ప్రజాశక్తి - భోగాపురం

ఓ రైతుకు చెందిన సుమారు 50వేలు రూపాయలు విలువైన రెండు మేకపోతులను దొంగలు ఎత్తుకుపోయారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. భోగాపురం గ్రామానికి చెందిన పట్నాల అప్పన్న రెండు మేకపోతులను పెంచుకున్నాడు. పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న శాలలో కట్టగా వీటిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించికుపోయారు. ఈ విషయం రైతు తెలియజేయడంతో విచారణ సాగిస్తున్నామని ఎస్ఐ పాపారావు తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

●పలుచోట్ల ముగ్గులు, కోలాటం పోటీలు ●గోవిందపురంలో పేదలకు దుస్తులు, విజయనగరంలో నిత్యావసరాలు పంపిణీ ●డెంకాడలో క్రికెట్ టోర్నమెంట్

జిల్లా వ్యాప్తంగా సోమవారం సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలు చోట్ల ముగ్గులు పోటీలు, కోలాటం నిర్వహించారు. కొత్తవలస మండలంల నిమ్మలపాలెంలో పాల రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోలాటం పోటీలను నిర్వహించారు. గోవిందపురంలో సర్పంచ్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. విజయనగరంలో జిల్లా శిష్టకరణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా డెంకాడ మండలం పినతాడివాడలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది.



కొత్తవలస: కోలాటాన్ని తిలకిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని నిమ్మలపాలెంలో ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా కోలాటం పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలు పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి సారధ్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాసా, అతిథులుగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు హాజరై తిలకించారు. ఈ పోటీల్లో రంగోలి, పిల్లలు నృత్యాలు కోలాటం అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

గోవిందపురంలో బట్టలు పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో సర్పంచ్ బాలా రామలక్ష్మి ప్రజలకు సంక్రాంతి సందర్భంగా ఆదివారం కొత్త వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని గోవిందపురం, భరణికాం, గులివిందలపేట ప్రజలను ఇంటికి పిలిచి అల్పాహారం అందించారు. అనంతరం స్త్రీ, పురుషులకు కొత్తబట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బాలా అప్పలరాజు మాట్లాడుతూ ఏటా తమ పంచాయతీ ప్రజలకు కొత్త బట్టలు పెట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తమతో పాటు తమ పంచాయతీ ప్రజలు కూడా సంతోషంగా పండగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో బట్టలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాలా గోపాలరావు, విక్రం జగన్నాధం, దంగుడుబియ్యపు ఈశ్వరావు, ఇనపకుర్తి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విజయనగరం: నగరంలోని ఆర్అండ్‌బి కూడలి సమీపంలో జిల్లా శిష్టకరణ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సంక్రాంతి సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సంఘం అధ్యక్షులు బలివాడ బాల భాస్కరరావు అధ్యక్షతన సుమారు వంది మందికి 15 రకాల సరుకులతో కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం సంపాదించిన దాంట్లో కొంత పేదలకు సాయం చేయాలనే ఆలోచనతో ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి దూళికేశ్వరావు, అసోసియేట్ అధ్యక్షులు కె.వి.శ్రీనివాసరావు, నాయకులు ఎల్.ప్రభాకరరావు, జి.ఎల్.వి.రమణమూర్తి, కె.వి.సత్యారావు, పి.సునీల్, ఎస్.నగేష్, శ్రీధర్, ఎం.పి.తిరుపతిరావు, ఎం.విశ్వేశ్వరరావు, వి.వి.నాగభూషణ రావు, బాంధవరావు, కె.శశిభూషణరావు పాల్గొన్నారు.



విజయనగరం: ముగ్గులు వేస్తున్న మహిళలు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

డెంకాడ: సంక్రాంతి పండగ సందర్భంగా యువకులు ఉత్తేజాన్ని తెచ్చేందుకు మండలంలోని పినతాడివాడ గ్రామం యువత బంగారమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు ఈ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ లంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వాళ్ళ వెంకట్రావు, మాజీ ఎంపిటిసి కొర్నాన ఆదిబాబు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఐదు జట్లు పాల్గొని తలబడుతున్నాయి. మూడు రోజులు పాటు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. ఒక్కొక్క టీమ్ రెండుసార్లు ఆడవలసి వస్తుందన్నారు. సంక్రాంతి రోజు గెలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తామన్నరు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ కూడా బహుమతులు ఉంటాయన్నారు. ప్రతి మ్యాచ్‌లోనూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

రంగవల్లికలు మన సంస్కృతికి ప్రతీకలు

విజయనగరం కోట: రంగవల్లికలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో వాజీ ఛానల్ ఆధ్వర్యాన నిర్వహించిన రంగవల్లికలు పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 ఏళ్లుగా మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు రంగోలీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొన్న మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పట్టణంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామకృష్ణ సేవాసమితి, సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. వివేకానంద ఉన్నతిని కీర్తిస్తూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక స్టేట్ బ్యాంక్ జంక్షన్ లో వివేకానంద విగ్రహానికి సరస్వతీ శిశు మందిర్ కార్యదర్శి కందర్ప మురళీకృష్ణ, బాసిన శ్రీనివాసరావు, వాకచర్ల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ్ ప్రచారక్ మణికంఠ, కొల్లూరు నాగేశ్వరరావు, పప్పు అప్పారావు, అప్పలరాజు, వెంకటరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగర: స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శనీయమని ఆయన బోధనలు అనుసరణీయమని వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ప్రదానోపాద్యాయులు బెవర ఈశ్వరరావు అన్నారు. ఆదివారం ఆ పాఠశాల ఆవర ణలో స్వామి వివేకానంద జయంతోత్సవాలు ఘనంగా నిర్వహి ంచారు. 'ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయులు స్వామి వివేకానంద చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించి బహు మతులు అందజేశారు. ఉపాధ్యాయులు నేతాజీ, రమేష్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు ఆతవ రవిశంకర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద పుట్టినరోజుకి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం వివేకానంద జీవిత చరిత్ర వివరించారు. ఆయన రాసిన భారత జాతికి నా హితవు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.



నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండలంలోని గంగుబుడిలో వివేకానంద జయంతి ఉత్సవాలు, రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం నుండి 15 టీమ్‌లు ఈ పోటీలు పాల్గొని తలబడ్డాయి. జనసేన నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ, వబ్బిన సన్యాసినాయుడు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరావు, కర్రి రాము, శ్రీరాములు స్కూల్ కమిటి చైర్మెన్ వి.గోవిందరావు, సర్పంచ్ జి.హరిప్రసాద్, రమణారావు, జి.వెంకటరమణ, రాజు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు కోరారు. పాత బొబ్బిలిలో ఆదివారం వివేకానంద జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత మంచి మార్గంలో నడిచి సమజాభివృద్ధికి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి గజరాయనివలస ఎంపిటిసి, టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం గొప్పతనాన్ని ప్రపంచమంతా చాటి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు.

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలసలో వివేక విద్యా విహార్‌లో స్వామి వివేకానంద జయంతోత్సవం సందర్భంగా ఆదివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంటు తాళపూడి శ్రీరామూర్తి మాట్లాడుతూ భరత్ మాత కన్న మహోన్నత వ్యక్తుల్లో వివేకానందుడు ఒకడన్నారు. అలాంటి మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

విజయనగరం టౌన్ : యువతకు స్ఫూర్తి వివేకానందుడని వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎఎస్ ప్రకాశరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎలక్ట్ గవర్నర్ ఎ.తిరుపతిరావు, కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్.సిహెచ్. అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో నాయకులు అవనాపు విక్రమ్.. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కూలిన బల్లంకి కల్వర్టు

నిలిచిపోయిన రాకపోకలు
కల్వర్టు నిర్మించాలని వేడుకోలు

ప్రజాశక్తి- వేపాడ

మండంలోని బల్లంకి గ్రామానికి వెళ్లే కల్వర్టు ఆదివారం ఉదయం కూలిపోయింది. బానాది ఎంపిటిసి గొంప తులసి సెగ్మెంట్‌లోని బల్లంకి, సింగవరం, కుద్దుపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కల్వర్టు మీదుగా ప్రయణిస్తుంటారు సుమారు 100 మందికి పైగా పిల్లలు ఈ కల్వర్టు పై నుంచే బక్కునాయుడుపేట ఎపి మోడల్ స్కూల్‌కు సైకిళ్లు, బస్సులు మీదు వెళ్లేవారు. నిత్యం వందల సంఖ్యలో విశాఖపట్నం దేవరపల్లి పనుల కోసం, అత్యవసర వైద్య సేవల కోసం ఆనందపురం రోడ్డుకు వెళ్లేందుకు కూడా ఈ కల్వర్టును వినియోగించేవారు. అటువంటి కల్వర్టు ఒక్కసారిగా కూలిపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలన్నా అదనంగా మరో ఆరు కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎస్‌కెఆర్ పురం రెవెన్యూ పరిధిలోని దేవరపల్లి మండలం వద్ద రైవాడ రిజర్వాయర్ నుంచి విశాఖ ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం విశాఖ నగరపాలక సంస్థ కాలువ ఏర్పాటు చేసి కాలు మీదుగా రాకపోకలకు ఆటంకం లేకుండా కల్వర్టు ఏర్పాటు చేశారు. ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరి వాహనాల రాకపోకలకు ప్రమాదంగా ఉందని గ్రామస్తులతో పాటు ఎంపిటిసి గొంపతులసి, టిడిని మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బల్లంకి ఉప సర్పంచ్ పల్లె ధనుంజయ నిరసన తెలిపారు. ప్రమాదాలు జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకు, ఎమ్మెల్యే, ఎమ్‌పి, మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో ఒక్కసారిగా ఈ కల్వర్టు కూలిపోయింది. ప్రస్తుతం రాకపోకలు నిలిచిపోయాయి.



కూలిపోయిన కల్వర్టు

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి



కల్వర్టు కూలిపోతుందని ముందే చెప్పాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కనీసం రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు, వైద్య సేవలు, దినసరి కూలీలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేసి కల్వర్టు నిర్మాణం వేగవంతం చేయాలి.

- గొంప తులసి, ఎంపిటిసి బానాది.

గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- నెల్లిమర్ల


నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఆదివారం నవోదయ గ్రంథాల కమిటీ, హనుమాన్ వ్యాయామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రంథాలయ నిర్మాణానికి నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, రిటైర్డ్ ప్రధానోపాద్యాయులు కడగల ప్రకాశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దలు, యువత, కలిసికట్టుగా త్వరితంగా గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తి చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు కడలి ప్రకాష్ రావు తనవంతుగా 50వేల రూపాయలను గ్రంథాలయ నిర్మాణం కోసం విరాళంగా అందించారు. అనంతరం మరి కొంత మంది ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, ఎమ్ఎమ్ నాయుడు, నల్లి శేఖర్, తుమ్మ వెంకటరమణ, పోలుబోతు నారాయణమూర్తి, పోలుబోతు సత్యనారాయణ, కాళ్ళ రాజశేఖర్, కిల్లంపల్లి రామారావు, మద్దిల శ్రీను, మద్దిల అప్పన్న, సుంకర ముత్యాలనాయుడు, హనుమాన్ వ్యాయామశాల కమిటీ గురువు అవనాపు అప్పారావు, మద్దిల ఆదినారాయణ, గ్రంథాలయ కమిటీ ఉపాధ్యక్షులు మద్దెల సత్యనారాయణ, ట్రెజరీ జగ్గిన ధనుంజయ్, కొండపల్లి జైరాం, పోలుబోతూ దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- బాడంగి

రాష్ట్రంలో పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభు త్వం పనిచేస్తోందని బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని పెదపల్లి గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సౌకర్యం దృష్ట్యా గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మొత్తం పాడి రైతులకు సబ్సిడీగా అందిస్తోం దన్నారు. వీటికి తోడు పశుగ్రాసం కొరత లేకుండా పశుగ్రాసం పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద నిధులు విడుదల చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, సర్పంచ్ ఆవు సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

డెంకాడ: డెంకాడలో మినీ గోకులం షెడ్‌ని ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపరిశ్రమల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గోకులాల నిర్మాణంతో పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తద్వారా రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెంది, రైతులకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, ఇఒపిఆర్‌డి రమణ, ఎపిఒ తిరుపతిరావు, ఇసి వెంకటరమణ, మాజీ పిహెచ్‌సి ఛైర్మన్ దంతుళూరి ప్రదీప్ రాజు, మాజీ సర్పంచ్ కొయనేని రమణ, సెక్రటరీ నాగలక్ష్మి, తులసి, జనసేన నాయకులు చింతపల్లి రాంమూర్తి, కో-ఆర్డినేటర్ పైల శంకర్, నీటి సంఘం ఛైర్మన్ సిరికి రమణ తదితరులు పాల్గొన్నారు.



గోకులాన్ని ప్రారంభిస్తున్న బుడా ఛైర్మన్ లక్ష్మునాయుడు

భోగాపురం: మండలంలోని చాకివలస గ్రామంలో గోకులాన్నీ గ్రామ సర్పంచ్ లెంక వెంకటలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్, ఎపిఒ భాగ్యలక్ష్మి, జనసేన నాయకులు వందనాల రమణ, పల్ల రాంబాబు, బొల్లు త్రినాథ్, సత్యనారాయణ, టిడిపి నాయకులు బొడ్డ రమణబాబు, పసుపులేటి లోకేష్ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.